# ముఖ్యమంత్రి కార్యాలయము,

# తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్.

పత్రికాప్రకటణ తేది.15-11-2014

హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం వున్న ట్రాఫిక్ రద్దీని తట్టుకోవడంతో పాటు రాబోయే 20 నుంచి 40 సంవత్సరాల వరకు కూడా మళ్లీ ఇబ్బందులు తలెత్తకుండా ఉండే విదంగా రహదారుల వ్యవస్థను మెరుగుపరచాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. హైదరాబాద్ నాలుగు దిక్కుల ఎక్స్ ప్రెస్ హైవేలను నిర్మించడంతో పాటు, ఆకాశవీదులు ( స్కై వే) లను నిర్మించాలని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ లో రహదారుల నిర్మాణానికి సంబందించి సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. రహదారుల వ్యవస్తకు సంబందించిన నిపుణులతో శనివారము ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిహెచ్ఎంసి కమీషనర్ సోమేష్ కుమార్, సిఎంఒ ముఖ్య కార్యదర్శి నర్సింగ్ రావు, ఎల్ఇఎ అసోసిఏట్స్ ప్రతినిదులు డా.ఎం ఫనిరాజు, కెనడాకు చెందిన రవాణా వ్యవస్థ, రహదారుల ప్రణాళికా నిపుణుడు జాన్ ఫెర్టో, టిఎస్. రెడ్డి, ఎన్.హనుమంత రావు తదితరులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

హైదరాబాద్ నగరంలో ప్రతి యేటా 10 లక్షల జనాభా పెరుగుతుందని రాజదాని నగరం కావడంతో వివిధ అవసరాల కోసం వచ్చే వారి సంఖ్య ప్రతి రోజు 15 లక్షల పైగా వుంటుందని ముఖ్యమంత్రి అంచనా వేశారు. ప్రస్తుతం ఉన్నరోడ్లు, ఇప్పటి అవసరాలు తీర్చలేకపోతున్నాయని, మెరుగు పరచకుంటే భవిష్యత్తులో హైదరాబాద్ గందరగోళంగా తయారవుతుందని ముఖ్యమంత్రి చెప్పారు. ప్రపంచంలోని అన్ని నగరాలలో 'గ్రిడ్ లాక్' కాకముందే (నగరంలోని అన్ని వాహణాలు రోడ్డు పైన నిలబడితే కూడా ఇంకా కాళీ జాగ ఉండే రహదారి వ్యవస్థ ఉండాలి. అలా ఉండకుంటే దానిని 'గ్రిడ్ లాక్' అంటారు.) గ్రిడ్ లాక్ కాకముందే భవిష్యత్ అవసరాల కోసం ప్రణాళికలు సిద్దం చేసుకొని, రహదారులను అభివృద్ది చేసుకొంటామని ముఖ్యమంత్రి చెప్పారు.

హైదరాబాద్ లో ఎప్పుడో గ్రిడ్ లాక్ అయ్యిందని వెల్లడించారు. పెళ్లిల్ల సమయం అయితే హైదరాబాద్ లో ప్రయాణం నరకప్రాయమని అన్నారు. పెళ్లిల్లలో 5, 10 నిమిషాలు గడిపితే, రోడ్ల మీదనే 3 గంటల పాటు ఉండాల్సివస్తుందని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటికైనా మేల్కొనాల్సిన అవసరముందని వెల్లడించారు.ట్రాఫిక్ లేకుండా వాహనాలు తిరిగేందుకు చాలా నగరాల్లో 6, 8, 10 లైన్ల రోడ్లను నిర్మిస్తారని, అయితే హైదరాబాద్ లో పరిస్థితి అందుకు అనుగుణంగా లేదన్నారు. పెద్ద పెద్ద రహదారులు వెయ్యాలంటే చాల ప్రాంతాల్లో కూల్చివేతలు జరపాల్సి వుంటుందని ఇది అంత సులబం కాదన్నారు. ఇస్తాంబుల్ తరహాలో చారిత్రాత్మక కట్టడాలను పరిరక్షించుకుంటేనే నగరంలో రహదారుల వ్యవస్థను మెరుగుపరచాలని చెప్పారు.

ఇప్పటికే అనుకున్నట్లు పరేడ్ గ్రౌండ్, తూంకుంట, ఎల్బి నగర్, హాయత్ నగర్, ఉప్పల్ – ఘట్ కేసర్ లలో ఎక్స్ ప్రెస్ ఎలివేటెడ్ హైవేలు నిర్మించాలని తెలిపారు. వివిధ జిల్లాలనుంచి నగరంలోకి వచ్చే వాహణాలు నగర శివార్లలోనే ట్రాఫిక్ లో చిక్కకుండా ఎక్స్ ప్రెస్ హైవేలు దోహదపడతాయన్నారు.

ఎల్బి నగర్ నుంచి మియాపూర్ వరకు, ఉప్పల్ నుండి హైటెక్ సిటీ వరకు విపరీతమైన ట్రాఫిక్ రద్ది ఉంటుందని ఈ రూట్లలో హైవే నిర్మించాలని ముఖ్యమంత్రి అన్నారు. పాతబస్తీలో కూడా రోడ్ల పరిస్థితిని పూర్తిగా అధ్యయనం చేసి రహదారుల వ్యవస్థను మెరుగుపరచాలని ముఖ్యమంత్రి చెప్పారు. నగరంలోని అన్ని రహదారుల పరిస్థితికి వాటిపై వుండే వాహనాల రద్దిని, జంక్షన్ల వద్ద ఉండే వత్తిడిపై అధ్యయనం చెయ్యాలని ముఖ్యమంత్రి చెప్పారు. రద్ది భాగావుండే మార్గాలలో మొదటి దశలలోనే రహదారుల వ్యవస్థను మెరుగు పరచాలన్నారు. మొదటి దశలో 2000 కిలో మీటర్లను గుర్తించి అమార్గాలలో ఆకాశ వీధులు నిర్మించాలని ( స్కైవే) రహదారులు వెడల్పు చేయ్యాలని, జంక్షన్ లను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. ఇప్పుడున్న ఫ్లైఓవర్ల మాదిరిగా కాకుండా మల్టీ లేయర్ ఫ్లైఓవర్స్ లు, వివిధ ఫ్లైఓవర్స్ ల మధ్య ఉపరితలంపై ఉండే విధంగా ఆకాశంలోనే జంక్షన్లు ఏర్పాటు చేయ్యాలని ముఖ్యమంత్రి సూచించారు. మొదటి దశలో జిహెచ్ఎంసి పరిధిలో రోడ్లను మెరుగుపరచాలని ఆ తర్వాత హెచ్ఎండిఏ పరిధిపై దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. రహదారులు, ఫ్లైఓవర్లు

నిర్మించే దశలోనే, భుగర్భ డ్రైనేజి, భూగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని, మళ్లీ మళ్లీ రోడ్లను తవ్వుకునే పరిస్థితి రాకుండా చూసుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. పూర్తి ఇబ్బంది వచ్చిన తర్వాత అప్పటికప్పుడు హడావుడిగా పనులు చేసుకోవటం పరిపాటిగా మారిందని ఆ పరిస్థితిలో  పూర్తిగా మార్పురావాలని ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటి సమస్యను అదిగమిస్తే భవిష్యత్ పరిణామాలను అంచనా వెయ్యాలని, అందుకు అనుగుణంగా పనులు జరగాలని ముఖ్యమంత్రి అన్నారు. రాబోయే 35సంవత్సరాల అవసరాలకు తగ్గట్టుగా రోడ్లను అభివృద్ధి చేయాలన్నారు. ఇప్పుడున్న ఔటర్  రింగ్ రోడ్స్ కి అవతలి ప్రాంతంలో ఒక రీజినల్ రింగ్ రోడ్ కూడా రావాలని ముఖ్యమంత్రి చెప్పారు. సంగారెడ్డి, వికారాబాద్, షాబాద్, షాద్ నగర్, ఇబ్రహీంపట్నం, చౌటుప్పల్, భువనగిరి, జగదేవ్ పూర్, గజ్వేల్, తుప్రాన్ ల మీదుగా రింగ్ రోడ్ నిర్మించాలని అన్నారు. ప్రపంచంలోని ఏ పౌరుడైన హైదరాబాద్ లోనే నివసించడానికి ఇష్టపడతారని, అందుకు తగ్గట్టుగా నగరాన్ని తీర్చదిద్దుకోవాలని ముఖ్యమంత్రి చెప్పారు. వివిధ రాష్ట్రాల నుంచి ఇక్కడికి వచ్చిన సివిల్ సర్కిల్ అధికారులు, న్యాయమూర్తులు ఇక్కడే స్థిరపడుతున్నారని, ఇది మనకు గర్వకారణమని చెప్పారు. ఇక్కడున్న వాతావరణ పరిస్థితులు, భౌగోళిక స్థితిగతులకు అనుగుణంగానే మౌళిక సదుపాయాల కల్పన కూడా జరగాలన్నది తమ అభిమతమని ముఖ్యమంత్రి చిప్పారు. హైదరాబాద్ రహదారుల వ్యవస్థను తీర్చిదిద్దడం కొరకు 25 నుంచి 30 వేల కోట్ల రూపాయలు అవుతాయని ప్రాథమిక అంచనా వేశారు.

ప్రస్తుతమున్న ఎయిర్ పోర్ట్ తో పాటు నగరానికి ఉత్తర భాగంలో మరో ఎయిర్ పోర్ట నిర్మించాల్సిన అవసరం వుందని ముఖ్యమంత్రి అన్నారు.

**( సిపిఆర్ఓ టు సియం )**